ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల
జిల్లా వార్తలు
5
సోమవారం 24 ఫిబ్రవరి 2025



నేడు జిల్లాకు సీఎం రాక



- పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళన సభకు హాజరు
- ఊపందుకున్న ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం....
- కాంగ్రెస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ముందుకు
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు



సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వివిధ పార్టీలు తమ అభ్యర్థుల కోసం ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నాయి. ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీలు పోటాపోటీగా అగ్రనేతలను ఆహ్వానిస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్- మెదక్-నిజామాబాద్-కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు మంచిర్యాలలో అధికంగా ఉండటంతో అగ్రనేతల చూపంతా ఇక్కడే కేంద్రీకృతమై ఉంది. కాంగ్రెస్ అభ్యర్థి వూటుకూరి నరేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డికి మద్దతుగా ఆయా పార్టీల నేతలు ముమ్మరంగా ప్రచారంలో పాల్గొంటున్నారు.

భారీ సంఖ్యలో పట్టభద్రులు, కాంగ్రెస్ శ్రేణుల తరలింపు...

కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డికి మద్దతుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం కోసం సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం మంచిర్యాలకు రానున్నారు. ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ సారథ్యంలో జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమీపంలో మధ్యాహ్నం 2 గంటలకు పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళన సభ ఏర్పాటు చేస్తుండగా సీఎంతోపాటు టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్, ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తదితరులు హాజరుకానున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో..

(తరువాయి 7లో)

సమన్వయంతో ముందుకు...?

పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం కాంగ్రెస్ తరుపున విద్యా సంస్థల అధినేత, కరీంనగర్‌కు చెందిన నరేంద ర్‌రెడ్డికి క్రమంగా ఎమ్మెల్యేల నుంచి మద్దతు పెరుగుతోంది. అభ్యర్థి నరేందర్ రెడ్డికి మద్దతుగా మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల ఎమ్మెల్యే కొ క్కిరాల ప్రేంసాగర్‌రావు, గడ్డం వినోద్, గడ్డం వివేకానందలు సమన్వయంతో ముందుకు సాగుతున్నారు. ఇటీవల బెల్లంపల్లిలో నిర్వహించిన ప్రచార సభలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి స్థానిక ఎమ్మెల్యే వినోద్ పాల్గొన్నారు. అప్పటి నుంచి వినోద్ నియోజక వర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు గా ముమ్మర ప్రచారం నిర్వహిస్తున్నారు. చెన్నూరు నియోజక వర్గంలోనూ అక్కడి ఎమ్మెల్యే వివేకానంద సైతం రెండు రోజుల నుంచి విరివిగా ప్రచారంలో పాల్గొంటున్నారు. అలాగే మంచిర్యాల నియోజక వర్గంలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు నేతృత్వంలో కాం గ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ అధిష్టానం తన అభ్యర్థి గెలుపు లక్ష్యంగా ముందుకు సాగుతోంది.

యాగంలో సేవలందించిన గీతా సత్సంగ్ భక్తులు



యాగంలో పాల్గొన్న భక్తులు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సీసీసీ పోలీస్ స్టేషన్ ఎదుట నిర్వహిస్తున్న శ్రీక్రిష్ణ కాలచక్ర వైష్ణవ అయిత చండీ అతిరుద్రంలో భాగంగా ఆదివారం శ్రీ సీతారామచద్ర సామ్రాజ్య పట్టణాభిషేకం జరిగింది. ఆదివారం శ్రీరాంపూర్‌లోని శ్రీ భగవద్గీత సత్సంగం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు దాసరి భక్త రాజేశం ఆధ్వర్యంలో పలువురు సభ్యులు సేవలందించారు. భగద్గీతలోని మూడు అధ్యాయాలు పారాయణం చేశారు. విష్ణు సహస్రనామం, శ్రీకృష్ణుని భజన చేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డిడి ప్రసాద్, ఆర్. మల్లేష్, సిహెచ్. రాంబాబు, బి. రాజమౌళి, మారెపల్లి సారయ్య, రాజేశం, రాజేశ్వరి, స్వర్ణకుమారి, వినోద పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ప్రచార సభను విజయవంతం చేయాలి

జన్నారం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో నేడు జరిగే ఎమ్మెల్సీ ప్రచారానికి సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పోరేషన్ చైర్మన్ బాలరాజు అన్నారు. ఆదివారం మండలంలోని మందపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఏర్పడిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడం జరిగిం దన్నారు. రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ చేసిందన్నారు. ప్రతి కార్యకర్త కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. సీఎం ప్రచార సభను విజయవంతం చేసేందుకు పెద్ద సంఖ్యలో తరలి రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముజా ఫర్ అలీ, మోహన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, పసివుల్లా, సుభాష్ రెడ్డి పాల్గొన్నారు .

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్‌షి ప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆదివారం మంచిర్యాలలోని మార్క్స్ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఎన్నికల ముందు విద్యారంగ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలను విస్మరించిందన్నారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ఎన్నికలపై ఉన్న శ్రద్ధ విద్యారంగంపై లేదన్నారు. పెండింగ్ నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సికిందర్, కార్తీక్, వంశీ, సంతోష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

బంజారాల ఆరాధ్య దైవం సేవాలాల్

● ఎమ్మెల్యే వినోద్



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : బంజరాల ఆరాధ్య దైవం సేవాలాల్ మహారాజ్ అని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సంత్‌శ్రీ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఆదివారం బెల్లంపల్లి పట్టణంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. సేవాలాల్ మహారాజ్, జగదాంబ అమ్మవారికి, మేరమ్మ యాడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సేవాలాల్ బంజారాల సంస్కృతి, ఆధ్యాత్మిక అభ్యున్నతికి ఎంతో కృషి చేశారన్నారు. సేవాలాల్ ఆదర్శాలు, బోధనలు నేటి తరానికి మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హరికృష్ణ, బంజారా ప్రతినిధులు, నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష

లక్షెట్టిపేట, ఫిబ్రవరీ 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బాలికల గురుకులంలో ఆదివారం నిర్వహించిన టీజీసెట్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం పరీక్షకు 674మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 16మంది గైరాజరు కావడంతో 658మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్ష కేంద్రాన్ని పరీక్ష కేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర ఎంజేపి జాయింట్ సెక్రటరీ తిరుపతితో పాటు జిల్లా విద్యాశాఖ కార్యాలయం నోడల్ ఆఫీసర్ దామోదర్ పరిశీలించారు. పరీక్ష కేంద్రంలో ప్రిన్సిపల్ రమాకల్యాణి, వైస్ ప్రిన్సిపల్ ఉమామహేశ్వర్‌రావు విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించారు.

అటవీ అధికారుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా



జగదీశ్వర్‌ను సన్మానిస్తున్న నాయకులు

గర్మిళ్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : అటవీ అధికారుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తానని అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ఉపాధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. మారం జగదీశ్వర్‌ను టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు గడియారం శ్రీహరి ఆధ్వర్యంలో ఆదివారం ఫారెస్టు అసోసియేషన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. జగదీశ్వర్ వివాహ వార్షికోత్సవం సందర్భంగా సిరిసిల్ల పద్మశాలి నేతలతో నేసిన అగ్గిపెట్టిలో పెట్టే పట్టు వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎన్‌జీవో సెంట్రల్ ఫోరం అధ్యక్షుడు పొన్న మల్లయ్య, సుభాష్, కాళేశ్వరం జోనల్ సెక్రటరీ జూనియర్ ఫారెస్టు అసోసియేషన్, కవ్వాల్ సర్కిల్ రిప్రజెంటేటివ్ నాయకులు అజర్, టీఎన్‌జీవో నాయకులు రామ్మోహన్, శ్రీపతి బాపురావు పఆల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాల క్రైం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారంలో భాగంగా నేడు మంచిర్యాలకు సీఎం రేవంత్‌రెడ్డి వస్తున్నారని, అధిక సంఖ్యలో పట్టభద్రులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. ఆదివారం ఆయన నివాసంలో ఎమ్మెల్సీ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ 16500 మంది పట్టభద్రుల ఓటర్లు మంచిర్యాల నియోజకవర్గంలో ఉన్నారన్నారు. మేధావులు, విద్యావంతులు తమ ఓటు హక్కును వినియోగించుకొని కాంగ్రెస్ బలపర్చిన నరేందర్‌రెడ్డిని అధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి 50 వేల ఉద్యోగాలను భర్తీ చేశామన్నారు. రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఇచ్చిన హామీ ప్రకారం త్వరలోనే వాటిని కూడా నెవరేరుస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బస్తాకు రెండు కిలోలు తేమ పేరుతో రైతులను దోచుకుందని మండిపడ్డారు. రైతులను మోసం చేసిన వారు తప్పకుండా శిక్ష అనుభవిస్తారన్నారు. నస్పూర్‌లో ఏర్పాటు చేసే రేవంత్‌రెడ్డి సభకు పట్టభద్రులు సుమారు 12 వేలకు పైగా హాజరవుతారన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టభద్రులకు, ప్రభుత్వానికి వారధిగా పని చేస్తానన్నారు. పట్టభద్రుల సమస్యల కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ, పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, పూదరి తిరుపతి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారానికి సీపీఐ ఎల్లప్పుడూ పోరాడుతుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేనశంకర్ అన్నారు. సీపీఐ శత జయంతి ఉత్సవాల సందర్భంగా శ్రీరాంపూర్‌లో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ ఏర్పాటైన నాటి నుంచి ప్రజలకు అందుబాటులో ఉంటూ రాజకీయాలకు అతీతంగా పనిచేస్తున్నామన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మత తత్వ రాజకీయాలను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. బడా పారిశ్రామికవర్గాలకు ఆ పార్టీ అనుకూలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, నాయకులు మేకల దాసు, లింగం రవి, పూజారి రామన్న, మిర్యాల రాజేశ్వర్ రావు, ముష్కె సమ్మయ్య, కొట్టె కిషన్ రావు, కొత్తపల్లి మహేష్, సంఘం సదానందం, సురేష్, చిలుక రాంచందర్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

ఎండలతో జాగ్రత్త
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- వడదెబ్బ తగిలే అవకాశం
- గర్భిణులు, పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలి
- వైద్యుల సూచనలు 6

'సత్య' సేవా
- ఆదర్శంగా నిలుస్తున్న సత్యసాయి సేవా సమితి 7

ఇంటర్మీడియెట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

● జిల్లా నోడల్ అధికారి సీహెచ్ కల్యాణి



ఆంధ్రజ్యోతి : జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలకు ఎంత మంది విద్యార్థులు హాజరుకానున్నారు?

నోడల్అధికారి : జిల్లాలో ఇంటర్మీడియెట్ పరీక్షలకోసం మొత్తం 10,043 మంది హాజరుకానుండగా వీరిలో మొదటి సంవత్సరంలో 4,756 మంది, ద్వితీయ సంవత్సరంలో 5,287 మంది ఉన్నారు.

ఆంధ్రజ్యోతి : పరీక్షలకు ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేశారు?

నోడల్అధికారి : జిల్లాలో మొత్తం 48 జూనియర్ కళాశాలలు ఉండగా వీరికోసం 19పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశాం. వీటిలో 11 ప్రభుత్వ, రెండు ప్రైవేటు, రెండు ఆదర్శ పాఠశాలలు, రెండు గిరిజన సంక్షేమ శాఖ కళాశాలు, ఒక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశాం.

ఆంధ్రజ్యోతి : మాస్ కాపీయింగ్ జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

నోడల్అధికారి : జిల్లాలో 19 పరీక్షా కేంద్రాల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నాము. ముగ్గురు సభ్యులతో కూడిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంతో పాటు ఇద్దరు సభ్యులతో ఒక్కో టీం చొప్పున రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేస్తున్నాం. బృందాల ద్వారా ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేపట్టి మాస్ కాపీయింగ్ నిరోధించడానికి అన్ని చర్యలు చేపట్టాము.

ఆంధ్రజ్యోతి : విద్యార్థులకు మీరిచ్చే సందేశం ఏమిటి?

నోడల్అధికారి : విద్యార్థులు ప్రణాళికతో చదువుకొని పరీక్షలకు సన్నద్ధం కావాలి. సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలి. పరీక్షా కేంద్రంలో ప్రశాంతంగా పరీక్షలు రాయాలి.

-ఆసిఫాబాద్ రూరల్(ఆంధ్రజ్యోతి)

ఎండలతో జాగ్రత్త..



- పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- వడదెబ్బ తగిలే అవకాశం
- గర్భిణులు, పిల్లలు, వృద్ధులు జాగ్రత్తలు పాటించాలి
- వైద్యుల సూచనలు



నాలుగు రోజుల్లో నమోదైన ఉష్ణోగ్రతలు

తేదీ	కనిష్ఠం	గరిష్ఠం
20	18.1	38.0
21	18.6	38.1
22	18.8	38.2
23	18.7	38.4



చింతలమానేపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మార్చి రాకముందే ఎండలు మండిపోతున్నాయి. అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రాబోయే రోజుల్లో ఇంకా ఎలా ఉంటుందోనని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. సాధారణంగా మార్చి మొదలైన తర్వాత ఎండల తీవ్రత పెరిగే అవ కాశం ఉన్నది. కానీ ఈ ఏడాది ఫిబ్రవరి నెలలోనే ఎండతీవ్రత ఎక్కువగా ఉంటుందని ప్రభుత్వం హెచ్చరించింది. ఈ ఎండలకు వడదెబ్బతో అనారోగ్యం పాలవకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ఎండలో పని చేసేవారు ఉదయం 11 గంటలలోపు, సాయంత్రం 4 గంటల తర్వాత పని చేయాలని సూచిస్తున్నారు. తీవ్రమైన ఎండ, వేడి గాలులు వీచినప్పుడు ఎండదెబ్బకు గురయ్యే అవకాశం ఉంటుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

● వడదెబ్బ లక్షణాలు..

- శరీర ఉష్ణోగ్రత పెరగడం
- తీవ్రమైన తలనొప్పి,
- నాడీ వేగంగా కొట్టుకోవడం
- నాలుక ఎండిపోవడం
- నీరసంగా ఉంటూ తడబడడం
- శరీరంలో నీటిశాతం కోల్పోవడం (తగ్గడం)
- మూత్రం పసుపు రంగులో ఉండి మంటగా రావడం

వడదెబ్బ తగిలితే పాక్షికంగా లేదా పూర్తిగా అపస్మారక స్థితికి చేరుకునే అవకాశం ఉంటుంది.

● తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- వడదెబ్బ తగిలిన వారిని చల్లని నీడ ప్రదేశంలో ఉంచాలి.
- ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు గొడుగు ఉపయోగించాలి.
- తెల్లని కాటన్ వస్త్రాలు వదులుగా ఉన్నవి ధరించాలి.
- బయటకు వెళ్లేటప్పుడు నెత్తిన టోపీ లేదా రుమాలు ధరించాలి.
- సాధ్యమైనంత వరకు ఎండలో తిరగవద్దు.
- ఉప్పు కలిపిన మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలి.
- కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ ద్రవం తాగడం మంచిది.
- ఇంట్లో ఉష్ణోగ్రత తగ్గించడానికి ఇంటి కిటికీలను నీటితో తడిపిన తట్టుతో కట్టుకోవాలి.
- వడదెబ్బ తగిలిన వ్యక్తిని త్వరగా చల్లని గాలి నీడ ఉన్న ప్రదేశానికి తరలించాలి.
- దుస్తులను వదులు చేసి గాలి తగిలేలా చేయాలి.
- చల్లని నీటిలో ముంచిన గుడ్డతో శరీరాన్ని తుడవాలి. వెంటనే ఆస్పత్రికి తరలించాలి.

వేసవిలో జాగ్రత్తగా ఉండాలి..

- రాజ్‌కుమార్, వైద్యాధికారి (రవీంద్రనగర్ పీహెచ్‌సీ)



మార్చి నెల ప్రారంభం కాకముందే ఎండల తీవ్రత పెరిగింది. సాధ్యమైనంత వరకు ఎండలో తిరగవద్దు. అవసరమైతే తప్ప బయటకు రావద్దు. రావాల్సి వస్తే నెత్తిన టోపీ, రుమాలు గొడుగుతో రావాలి. ఎండలో తిరిగితేనే వడదెబ్బ తగులుతుందని అనుకోవడం పొరపాటు. ఇనుప రేకుల కింద ఉన్నా వడదెబ్బ తగులుతుంది. మసాలాలతో తయారు చేసిన ఆహారాన్ని తీసుకోవద్దు. ఆహార పదార్థాలను ఎప్పటికప్పుడు తయారు చేసుకోవాలి. ఈ ఏడాది ఎండలు ఎక్కువగానే ఉండే అవకాశం ఉంది. ప్రభుత్వం అన్ని ఆరోగ్యకేంద్రాలు, సబ్‌సెంటర్లలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచింది.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత



బాధితుడికి సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్సై

దండేపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ పోర్టల్ సాయంతో రికవరి చేసి ఆదివారం బాధితుడికి అందజేసినట్టు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు. మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన బీమెల్ల వినయ్‌కుమార్ మ్యాదరిపేట కూరగాయల మార్కెట్‌లో తన వీవో స్మార్ట్‌ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. స్థానిక పోలీస్‌లకు ఫిర్యాదు చేయగా సాంకేతిక పరిజ్ఞానంతో ఆ ఫోన్‌ను ట్రేస్ చేసి వినయ్‌కుమార్‌కు అందజేశామని ఎస్సై చెప్పారు.

పేకాట స్థావరంపై దాడి

దండేపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొర్విచెల్మ శివారులోని లోని పేకాట స్థావరంపై ఆదివారం దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై తహసీనొద్దీన్ తెలిపారు. తమకు అందిన పక్కా సమాచారం మేరకు దాడి చేసి డబ్బులు పందెంగా పెట్టి పేకాడుతున్న లక్షెట్టిపేట, కొర్విచెల్మకు చెందిన నలుగురిని పట్టుకున్నామన్నారు. వారి నుంచి రూ. 3100 నగదు, పేకముక్కలు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వన్యప్రాణుల మాంసం పట్టివేత



పట్టుకున్న వన్య ప్రాణుల మాంసం, నిందితుడితో పోలీసులు

వేమనపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీల్వాయి బస్టాండ్ వద్ద ఆదివారం వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై వన్య ప్రాణుల మాంసాన్ని తీసుకువెళ్తుండగా పట్టుకున్నట్లు నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కల్మలపేట గ్రామానికి చెందిన తోకల జీవన్ ద్విచక్రవాహనంపై కల్మలపేట నుంచి నక్కలపల్లిలో మాంసాన్ని విక్రయించేందుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో అతని వాహనం తనిఖీ చేయగా అతని వద్ద ఒక దుప్పి, కుందేలు, అడవి పిల్లి మాంసం దొరికిం దన్నారు. జీవన్ బ్యాటరీల సహాయంతో వన్య ప్రాణులను వేటాడి చంపి మాంసాన్ని గుట్టుగా విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడని తెలిపారు. నిందితుడి వద్ద నుంచి దుప్పి తల, కాళ్లతో పాటు దుప్పి, కుందేలు, అడవి పిల్లి మాంసం స్వాధీనం చేసుకుని ఫారెస్టు అధికారులకు కేసు నిమిత్తం అప్పగించామన్నారు.

భూ వివాదంలో గొడవ: పోలీసులకు ఫిర్యాదు

జైపూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేలాల గ్రామంలో జరిగిన భూ వివాదంలో దాడి చేసిన ఘటనపై బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు అయిలి బానయ్య పెద్దపల్లి జిల్లా మంథనిలో నివాసం ఉంటుండగా ఆదివారం వేలాలలోని తన ఇంటి స్థలం వద్దకు వచ్చాడు. ఆ స్థలంలో జాతర సందర్భంగా కొందరు వ్యక్తులు బొమ్మలదుకాణం ఏర్పాటు చేయగా తనకు తెలియకుండా దుకాణం ఎలా ఏర్పాటు చేస్తారని మాట్లాడుతున్న క్రమంలో అదే గ్రామానికి చెందిన జాడి లింగయ్య, అతని కుమా రుడు రామకృష్ణతో కలిసి అయిలి బానయ్యపై దాడి చేశారు. తనతో పాటు తన భార్య అయిన రాజేశ్వరిని లింగయ్య బంధువులు కాళ్లతో తన్నుతూ కింద పడేసి బండలతో కొట్టినట్లు తెలిపారు. తమ ఇంటి స్థలాన్ని ఆక్రమించుకుని ఇల్లు నిర్మించుకునేందుకు యత్నిస్తున్నట్లు బాధితుడు బానయ్య తెలిపారు. దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, తన ఇంటి స్థలం తనకు ఇప్పించాలని జైపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు బానయ్య తెలిపాడు.

అప్పులబాధతో యువకుడి ఆత్మహత్య



వెంకటేష్(ఫైల్)

సిర్పూర్(టి), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలం భీమన్న దేవుడి ఆలయ వెనక భాగంలో మామిడి వెంకటేష్(35) అనే యువకుడు అప్పుల బాధతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై కమలాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటేష్ భీమన్న ఆలయ వెనుక భాగంలో ఉరివేసుకోగా ఆదివారం ఆలయానికి వచ్చిన భక్తులు మృతదేహాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అతని వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా కాగజ్‌నగర్ పట్టణంలోని కాపువాడకు చెందిన మామిడి వెంకటేష్‌గా గుర్తించారు. కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అప్పుల బాధతో తన భర్త ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడు వెంకటేష్ భార్య మామిడి అనూష పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

జగన్నాథ్‌పూర్ వంతెన పనుల పరిశీలన

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జగన్నాథ్‌పూర్ వంతెన పనులను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ జగన్నాథ్‌పూర్ వంతెనకు సంబంధించిన పనులన్నీ నాసిరకంగా జరుగుతున్నట్టు ఆరోపించారు. గతంలో ఈ బ్రిడ్జి నిర్మించటం నాసిరకంగా నిర్మించటంతోనే పిల్లర్లు పెద్దవాగు నీటి ప్రవాహానికి కొట్టుకపోయినట్టు తెలిపారు. ప్రస్తుతం బ్రిడ్జి చివర్లో కాంక్రీట్ నిర్మాణం చేయకుండా కేవలం మట్టిపోసి వదిలేసినట్టు తెలిపారు. దీని వల్ల వర్షాకాలంలో మళ్లీ మట్టి కొట్టుక పోయే అవకాశం ఉందన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పనులు నిబంధనల ప్రకారం చేయాలని తెలిపారు. ఈయన వెంట బీఆర్ఎస్ సిర్పూరు ఇన్‌చార్జి లెండుగురే శ్యాంరావుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

పెంచికలపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండంలోని కొండపల్లి గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు తికలరి నారాణ కుమారుడు వివాహ వేడుకల్లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు. ఆయన వెంట నాయకులు షరీఫ్, సారయ్య తదితరులు పాల్గొన్నారు.



బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

నిరంతర సాధనతోనే విజయం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్లు గౌడ్



కరాటే పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎంచుకున్న క్రీడల్లో నిరంతర సాధనతోనే విజయం సాధించవచ్చని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్లుగౌడ్ తెలిపారు. రెండు రోజులుగా పట్టణంలోని సీఐఎస్ఎఫ్ బారిక్‌లో నిర్వహిస్తున్న కరాటే రాష్ట్ర పోటీల ముగింపునకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కొద్ది సంవత్సరాలుగా కరాటే మాస్టర్ రంగు శ్రీనివాస్ ప్రతీ సంవత్సరం రాష్ట్ర స్థాయిపోటీలు నిర్వహిస్తూ అటు కరాటే అభివృద్ధికి చేయూతనందిస్తున్నారని తెలిపారు. ఆత్మస్థైర్యం కోసం కరాటే తప్పనిసరిగా యువతీ యువకులు నేర్చుకోవాలని సూచించారు. రాష్ట్రస్థాయి పోటీలకు పెద్దసంఖ్యలో ఆయా జిల్లాల నుంచి రావడం క్రీడలపై క్రీడాకారులకు ఉన్న ఆసక్తిని తెలియజేస్తుంద న్నారు. క్రీడాకారులు గెలుపోటములను ఒకే విధంగా తీసుకోవాలని క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. నేటి ఓటమి రేపటి విజయానికి నాంది అనే సూక్తితో ముందుకు సాగాలని తెలిపారు. అనంతరం ఆయా విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో అకాడమీ నిర్వాహకులు కరాటే మాస్టర్ రంగు శ్రీనివాస్, బీజేపీ నాయకులు దారా రవి సాగర్, అక్కల రమేశ్, దుర్గం అశోక్ రాజనీస్‌జైన్, దీక్షితులు, ఎస్ నరేష్, మాయ రమేశ్, మాస్టర్లు హరిక్రిష్ణ, కె. శ్రీనివాస్, భూమయ్య, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

నేతకాని మహర్ సేవా సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజ్‌కుమార్

నెన్నెల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నేతకాని మహర్ సేవా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నెన్నెల మండలం గంగారం గ్రామానికి చెందిన జాడి రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. మంచిర్యాలలోని అంబేద్కర్ భవన్‌లో ఆదివారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం స్వామి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి దుర్గం సిద్ధార్థ రామ్మూర్తి చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా తనపై నమ్మకంతో రాష్ట్ర కమిటీ జిల్లా స్థాయి పదవి కట్టబెట్టిందని అందుకు అనుగునంగా నేతకాని, మహర్ కులస్తుల అభివృద్ధి కోసం కృషి చేస్తానని రాజ్‌కుమార్ పేర్కొన్నారు.



బాధ్యతలు స్వీకరించిన డైరెక్టర్ సూర్యనారాయణ



శ్రీరాంపూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్)గా ఎల్‌వీ సూర్యనారాయణ ఆదివారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలి వరకు శ్రీరాంపూర్ ఏరియా జీఎంగా పనిచేసిన సూర్యనారాయణ డైరెక్టర్‌గా పదోన్నతి పొందారు. ఆదివారం బాధ్యతలు స్వీకరించగా, అన్ని విభాగాల జనరల్ మేనేజర్లు, అధికారులు, ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- మందమర్రి జీఎం దేవేందర్

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని మందమర్రి జీఎం దేవేందర్ తెలిపారు. ఆదివారం స్థానిక సింగరేణి పాఠశాల మైదానంలో డ్రీమ్‌యోగా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా జీఎం హాజరయ్యారు. ముందుగా యోగా జెండాను క్రీడాకారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉద్దేశంచి జీఎం మాట్లాడారు. సింగరేణిలో కార్మిక, కార్మికేతర కుటుంబాల ఆరోగ్యాన్ని దృష్టిలోపెట్టుకొని మైదానంలోనే యోగా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రత్యేక శిక్షకులతో యోగాను నేర్పిస్తున్నామని తెలిపారు. నేటి యాంత్రిక యుగంలో ప్రతీ ఒక్కరు ఆరోగ్యం కోసం కొంత సమయాన్ని వెచ్చించాలని తెలిపారు. వ్యాధుల బారిన పడకుండా ఆరోగ్యంగా జీవించాలంటే యోగా, వాకింగ్‌తో పాటు ఇతర శారీరక వ్యాయమాలు అవసరమని అన్నారు. ప్రతీ ఒక్కరు పరిమితంగా మంచి విటమిన్‌లతోకూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయన పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో పాల్గొన్న వారు యోగాసనాలను ప్రదర్శించారు. డ్రీమ్‌యోగా నిర్వాహకులు యోగా మాస్టర్ శంకర్‌ను జీఎం అభినందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఎగ్గడి రాజేశ్వర్‌రావు, లయోల కుమార్, యోగ మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు

సమాజ హితం కోరేది సాహిత్యమే

- బొగ్గు పెళ్లలు పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సమాజ హితమ కోరేది సాహిత్యమేనని పలువురు వక్తలు అన్నారు. సింగరేణి ఎస్టేట్స్ (కార్పొరేట్) కార్యాలయంలో ఎస్టేట్స్ అధికారిగా పనిచేస్తున్న ఎల్లం సుధాకర్ రాసిన కవితా సంపుటి 'బొగ్గు పెళ్లలు' పుస్తకాన్ని మంచిర్యాలలోని చార్వాక ట్రస్ట్ హాలులో ఆదివారం ఆవిష్కరించారు. మంచిర్యాల జిల్లా సాహితీ సంరక్షణ సమితి అధ్యక్షుడు దండనాయకుల వామన్‌రావు కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. మంచిర్యాల జిల్లాకు చెందిన సీనియర్ కవి, తెలంగాణ ఉద్యమ కారుడు యలయశ్రీ ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ముందుమాట రాసిన ఉమ్మడి వరంగల్ జిల్లా అరసం అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లేరు వీరస్వామి విశిష్ట అతిథిగా హాజరై తన అనుభవాలను పంచుకున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా అరసం ప్రధాన కార్యదర్శి మార్క శంకర్‌నారాయణ పుస్తకాన్ని పరిచయం చేస్తూ సమాజ హితం కోరేది సాహిత్యమేనని వివరణాత్మక విశ్లేషణ చేశారు. ఆత్మీయ అతిథిగా ఎల్ఐసీ ఉద్యోగి రాజేశం హాజరై సాహిత్యం ఆవశ్యకతను తెలిపి కవిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ, సింగరేణి అధికారులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు సింగరేణి ఉద్యోగులకు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. భారత ఎన్నికల సంఘం నియమావళిని అనుసరించి ప్రభుత్వ ప్రైవేటు పరిశ్రమలు, కార్యాలయాల్లో సెలవు ప్రకటించిన విధంగా సింగరేణి ఓటుహక్కు వినియోగించుకోవడానికి వీలుగా వేతనంతో కూడిన సెలవు అమలు చేయాలని కోరారు.

శ్రీరాంపూర్ ఏరియా మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీ ఎన్నిక

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియా మైనింగ్ స్టాఫ్ సబ్ కమిటీని నర్సయ్యభవన్‌లో ఎన్నుకున్నారు. ముఖ్య అతిథులు ఏఐటీయూసీ అధ్యక్షుడు వి. సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ఉప ప్రధాన కార్యదర్శి ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, మైనింగ్ స్టాఫ్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి వంగరి రాజేశ్వరరావు, ఉపాధ్యక్షుడు రాజశేఖర్ హాజరయ్యారు.

సబ్ కమిటీ శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడిగా అడ్డు శ్రీనివాస్, కార్యదర్శిగా బాలకృష్ణ, సహాయ కార్యదర్శిగా మహేష్, చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ప్రవీణ్, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా అనుదీప్, దీక్షిత్, నారాయణ, శంకరయ్య, విలాస్ వర్మ, రంజిత్, రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

బెల్లంపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి గెలుపు కోసం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నాయకులు, పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుద్యోగులకు, పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. రానున్న రోజుల్లో నిరుద్యోగులకు అనేక ఉద్యోగాల కల్పనకు ప్రత్యేక ప్రణాళికలను సీఎం రేవంత్‌రెడ్డి సిద్ధం చేస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన ఆల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. నాయకులు పాల్గొన్నారు.

క్రికెట్ ఆడి.....పోటీలను ప్రారంభించి

బెల్లంపల్లి పట్టణంలోని ఏఎంసీ క్రీడా మైదానంలో బెల్లంపల్లి ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ పోటీలను ఎమ్మెల్యే గడ్డం వినోద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కాసేపు క్రికెట్ ఆడారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ క్రీడాస్ఫూర్తితో ముందుకు వెళ్లాలని సూచించారు.

మల్లన్న స్వామికి వెండి నాగపడగ బహూకరణ



వెండి నాగ పడగ విగ్రహాన్ని అందజేస్తున్న రిటైర్డు కన్జర్వేటర్ ఫారెస్టు అధికారి తిమ్మారెడ్డి

జైపూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వేలాల గ్రామంలోని గట్టు మల్లన్న స్వామి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన రిటైర్డు కన్జర్వేటర్ ఫారెస్టు అధికారి తిమ్మారెడ్డి-నివేదితరెడ్డి దంపతులు మల్లన్న స్వామికి వెండి నాగ పడగను బహుమానంగా సమర్పించారు. దీని విలువ సుమారు రూ. 70 వేలు ఉంటుందని ఆలయ ఈవో రమేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో భగవంతరావు, ఎఫ్‌బీవో శ్రీదర్, మాజీ ఉపసర్పంచు డేగ నగేష్, ప్యాగ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

'సత్య' సేవా

- ఆదర్శంగా నిలుస్తున్న సత్యసాయి సేవా సమితి
- భక్తికి కొత్త భాష్యం చెబుతున్న బాబా భక్తులు
- జిల్లా వ్యాప్తంగా 9 సమితులు, వందల మంది సభ్యులు

నెన్నెల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రేమే దైవం.. సేవే ఆరాధనంటూ ఆధ్యాత్మికతకు కొత్త అర్థం చెబుతున్నారు భగవాన్ సత్యసాయిబాబా భక్తులు. అందరినీ ప్రేమించు.. అనే బాబా బోధనలతో స్ఫూర్తిపొంది.. ఉన్నంతలో పదిమందికి సాయపడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. జిల్లాలో వేల మంది సేవాయజ్ఞంలో పాలుపంచుకుంటున్నారు. ఉన్నత పదవులు, విలాసజీవితాలను గడిపేవారు సైతం సేవకులుగా మారి ఆపన్నులకు అభయహస్తం అందజేస్తున్నారు. అహం, దర్పం, హోదా వంటివన్నీ మరిచి సేవా మార్గంలో తరిస్తున్నారు.

● 30 ఏళ్ల కిందటే ఆవిర్భావం

జిల్లాలో మూడు దశాబ్దాల కిందటే సత్యసాయి సేవా సమితి ఆవిర్భవించింది. ప్రస్తుతం జిల్లాలో మంచిర్యాల, లక్షెట్టిపేట, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి, నెన్నెల, చెన్నూరు, పారిపెల్లి, దేవాపూర్, సీసీసీ నస్పూర్‌లలో సేవాసమితిలు ఉన్నాయి. మూడున్నరవేల మందివరకు సేవదళ్ సభ్యులున్నారు. వీరందరు ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాలు పంచుకుంటున్నారు. జిల్లాలో 150 బాబా భజన మండళ్లు ఉన్నాయి.



మంచిర్యాల ప్రభుత్వ దవాఖానాలో నిత్యాన్నదానంలో భోజనాలు చేస్తున్న రోగుల బంధువులు



కుట్టుశిక్షణ పొందిన యువతికి కుట్టుమిషన్ అందజేస్తున్న సేవా సమితి సభ్యులు

● బాల 'వికాసం'.. యువతకు సన్మార్గం

గ్రామాల్లో కంప్యూటర్, కమ్యూనిటీ సర్వీస్ సెటర్లు, కుట్టుశిక్షణ కేంద్రాలు ఏర్పాటుచేసి నిరుద్యోగులు, మహిళలకు ఉచితంగా శిక్షణనిస్తున్నారు. శిక్షణ పొందిన వారికి ఉచితంగా కుట్టు మిషన్లు, కంప్యూటర్ నేర్చుకున్నవారికి పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్నారు. గ్రామాల్లోని నిరుపేద విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్నారు. పేద పిల్లలకు స్టేషనరీ ఇస్తున్నారు. ప్రతి ఆదివారం బాలవికాస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 65 కేంద్రాల్లో బాలవికాస్ కార్యక్రమాలు నడుస్తున్నాయి. 5 ఏళ్ల నుంచి 17సంవత్సరాల పిల్లలను మూడు గ్రూపులుగా విభజించి మంచి పౌరులుగా తయారయ్యేలా శిక్షణనిస్తున్నారు. నాయకత్వ లక్షణాలు, లక్ష్యం, తల్లిదండ్రుల విశిష్టత, క్రమశిక్షణ, దేశభక్తి, దైవభక్తి, మంచి కుటుంబం, మంచి సమాజం తదితర అంశాల గూర్చి వివరిస్తు న్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో హ్యూమన్ వ్యాల్యూస్ ఇన్ ఎడ్యుకేషన్ పేరిట ప్రత్యేక తరగతులు నిర్వహి స్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం, సత్యసాయి సేవా సమితులు సంయుక్తంగా జిల్లాలోని ఆరు పాఠశాలల్లో ప్రతి నెల మొదటి, మూడవ శనివారం తరగతులు నిర్వహిస్తున్నారు. ఇందుకు గాను ప్రత్యేకంగా రూపొందించిన సిలబస్‌ను బోధిస్తున్నారు.

సేవే పరమార్థం...

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగుల బంధువులకు, అక్కడే ఉండే అనాధలకు నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతీరోజు రూ. పదివేల వరకు అన్నదానం కోసం వ్యయం చేస్తున్నారు. నెన్నెల మండల కేంద్రంలో 2010లో రూ.5 లక్షలు వెచ్చించి మంచినీటి మందిరం పేరిట ప్యూరి ఫైడ్‌వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. రూ.2కే కుంటుంబానికి సరిపడ శుద్ధజలాన్ని ఏటీడబ్ల్యూ ద్వారా 24గంటలు సరఫరా చేస్తున్నారు. 15 ఏళ్లుగా ప్లాంటు నిరాటంకంగా పనిచేస్తోంది. అనాధలకు, ఒంటరి వృద్ధులకు 'అమృతకలశం' పేరిట నెలనెల సరిపడ నిత్యవసర వస్తువులు అందజేస్తున్నారు. సత్యసాయి సమగ్ర గ్రామీణ అభివృద్ధి పేరిట జిల్లాలోని నాలుగు మారుమూల గ్రామాలను దత్తత తీసుకుని అక్కడ వివిద అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. ప్రతి వేసవిలో ప్రధాన పట్టణాల్లోని బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు, మార్కెట్లలో చలివేంద్రాలు ఏర్పాటుచేసి తాగునీరు సరఫరా చేస్తున్నారు. చలివేంద్రాల్లో కమిటీ సభ్యులే వంతుల వారిగా రోజుకు ఒక్కరిద్దరు చొప్పున సేవ చేయడం విశే షం. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లలో నివాసం ఉండే వృద్ధులు, యాచకులకు, మారుమూల గ్రామాల్లోని నిరుపేదలకు బ్లాంకెట్లు, చీరెలు, వికలాంగులకు ట్రైసైకిళ్లు అందజేస్తున్నారు. లక్షెట్టిపేట సబ్ జైల్‌లోని ఖైదీలలో పరివర్తన కోసం నెలకోసారి ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతు న్నారు. నిరుపేద యువతుల వివాహానికి గృహో పకరణాలు, గర్భిణులకు సీమంతాలు ఏర్పాటు చేసి వారికి తగిన పౌష్టిక ఆహారాన్ని ఉచితంగా అందజేస్తున్నారు. పల్లెల్లో మెగా వైద్య శిబిరాలు నిర్వహించి ఉచిత వైద్యసేవలు అందిస్తున్నారు. చూపు మందగించిన వారికి కంటి శస్త్ర చికిత్సలు చేపిస్తున్నారు. ప్రతినెల 19న మహిళా దినోత్సవం నిర్వహించి అతివల సమస్యలు గుర్తించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తున్నారు.



ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటుతున్న సత్యసాయి భక్తులు

● ఒక్కో రూపాయి పోగేసి...

సత్యసాయి సేవాసమితి వారు నిధుల సేకరణకు చాలసులువైన పద్ధతులను అవలంబిస్తారు. ఒక్క రూపాయిని కూడా వారు వితరణగా స్వీకరిస్తారు. ఉదాహరణకు లక్షెట్టిపేటలో 150 కుంటుంబాలు రోజుకు ఒక్క రూపాయి చొప్పున పోగేస్తున్నాయి. ఇలా 150 కుంటుబాల వారు నెలాఖరున ఇచ్చిన 30రూ పాయలే రూ.4500ల వరకు అవుతున్నాయి. ఇంతే కాకుండా సీలింగ్ అండ్ డిజైర్ పేరిట కొందరు చెడుఅలవాట్లకు దూరంగా ఉండి, వృధా ఖర్చులకు చేసే వ్యయాన్ని జమచేసి సమాజసేవకు ఉపయోగిస్తున్నారు. కమిటీ సభ్యులే కాకుండా వీరి సేవా కార్యక్ర మాలకు స్ఫూర్తి పొందిన వారు తమ వంతు సాయంగా ఎంతో కొంత అందజేస్తున్నారు. మంచిర్యాలలో చేసే నిత్యాన్నదాన కార్యక్రమానికి ప్రతిరోజయ్యే రూ.10వేల ఖర్చు ఇచ్చేందుకు వందల మంది ముందుకు వస్తున్నారు. ఏడాదికి సరిపడా ఖర్చులు భరించే వారు ఈపాటికే తమపేర్లను రిజర్వు చేసుకుని ఉన్నారంటే వారిసేవా కార్యక్రమాలు ఎంత విజయవంతంగా నడుస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు.

రాష్ట్రంలో అస్తవ్యస్తంగా కాంగ్రెస్ పాలన

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, పక్కన ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా మారిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం రాత్రి మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని ఎంఎన్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండూ ఒక్కటేనని, రెండు పార్టీలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయన్నారు. రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఓడించాలని, బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓట్లు వేసి గెలిపించాలన్నారు. రాష్ట్రంలో రోజు రోజుకూ నిరుద్యోగం పెరుగుతోందని, ప్రభుత్వం కొత్తగా ఉద్యోగావకాశాలు కల్పించడంలేదని మండిపడ్డారు. ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ రాష్ట్రాన్ని సగం దోచుకుంటున్నారని, ఇప్పుడు సగం కాంగ్రెస్ దోచుకుంటోందన్నారు. బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు మల్క కొమురయ్య, అంజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, ఆరుముళ్ల పోశం, దుర్గం అశోక్, శ్రీనివాస్, కృష్ణ, వేణు, దీక్షితులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డిని గెలిపించాలి

మంత్రి శ్రీధర్‌బాబు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు, పక్కన ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, చొప్పదండి, మానకొండూర్ ఎమ్మెల్యేలు మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ

భగత్‌నగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావేత్త అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డిని గెలిపించాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆదివారం కరీంనగరంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాలలు శ్రీచైతన్య, నారాయణ కళాశాలలకు దీటుగా రాష్ట్ర వ్యాప్తంగా కళాశాలలు ఏర్పాటుచేసి నామమాత్రపు ఫీజులతో విద్యార్థులను తీర్చిదిద్దుతుతున్నారన్నారు. అలాంటి విద్యావేత్తపై దుష్ప్రచారం చేయడం తగదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు నిద్రపోతే, తాము అధికారంలోకి వచ్చిన పది రోజులకే పది వేల ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేసేందుకు మెగా డీఎస్సీ ప్రకటించామన్నారు.. రాష్ట్రంలోని ఐటీఐలను ఏటీసీలుగా మార్చి టెక్నాలజీ పరంగా శిక్షణ కార్యక్రమాలు అందిస్తున్నామన్నారు. ముస్లింలు బీసీ ఈలుగా 2005 సంవత్సరంలోనే ఉన్నారన్నారు. ఇప్పుడు బీసీల్లో కొత్తగా ముస్లింలను తాము చేర్చలేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావేత్త అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మానకొండూర్, చొప్పదండి ఎమ్మెల్యేలు కవ్వం పల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం పాల్గొన్నారు.

మాఫియా మంచిర్యాలగా మార్చిన ఎమ్మెల్యే

గర్మిళ్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలను ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు మాఫియా మంచిర్యాలగా మార్చారని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. ఆదివారం మంచిర్యాలలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లడారు. గడిచిన 15 నెలల్లో మంచిర్యాలలో ఎక్కడ చూసినా కొట్లాటలు తప్పుడు కేసులు పెట్టడమే తప్ప ఎమ్మెల్యే చేసిందేమి లేదన్నారు. ప్రతి పక్ష నాయకులు, కార్యకర్తలు ఎదురు మాట్లాడితే వారిపై అక్రమ కేసులు పెట్టించడం లేదా మనుషులతో కొట్టించడం ఎమ్మెల్యే చేస్తున్నాడన్నారు. మంచిర్యాల - అంతర్గాం గోదావరి నదిపై బ్రిడ్జిని కాలేజీ రోడ్డు గోదావరిపై నిర్మించకుండా ముల్కల్ల నుంచి ముర్మూరు మీదుగా అంతార్గం వరకు బ్రిడ్జి నిర్మాణం చేపట్టడానికి ఎక్కువ ఖర్చు అవుతుందన్నారు. దీన్ని విరమించుకుని గతంలో మాదిరిగానే మంచిర్యాల -అంతర్గాం గోదావరిపై బ్రిడ్జి నిర్మించాలన్నారు. అలాగే ఎమ్మెల్యే నేతృత్వంలో గోదావరి నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తూ డబ్బులు దండుకుంటున్నారన్నారు. నాయకులు నడిపెల్లి విజిత్‌కుమార్, సత్యం, తిరుపతి, తాజుద్దీన్, మల్లేష్, జావర్, కొమురయ్య, రఫీ, శంకర్, శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

కరెన్సీ మ్యాన్‌కు కామన్ మ్యాన్‌కు పోటీ

ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసన్న హరికృష్ణ

సుబాష్‌నగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పటుటభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక కరెన్సీ మ్యాన్‌కు.. కామన్ మ్యాన్‌కు మధ్య జరుగుతున్న పోటీ అని, డబ్బుంటే గెలవచ్చనే వారికి, డబ్బున్నవారికే టికెట్లు ఇవ్వాలనుకునే పార్టీలకు ఈ ఎన్నికల ద్వారా గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్సీ బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ అన్నారు. ఆదివారం సాయంత్రం కరీంనగర్‌లోని పూలే గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పట్టభద్రుల సింహగర్జన సభలో ఆయన మాట్లాడారు. 19 ఏళ్ల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి రాజీనామా చేసి, పట్టభద్రు లకు సరైన న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఈ ఎన్నికల బరిలో నిలిచి మీముందుకు వచ్చానన్నారు. అనంతరం ఆయన ఎన్నికల మెనిఫెస్టోపై సంతకం చేశారు. తనను గెలిపిస్తే జీతంలో 50 శాతం నిరుద్యోగుల కోసం ఖర్చు చేస్తానని, జాబ్ క్యాలెండర్ అమలు, ఉద్యోగాల పెంపు, గ్రంథాలయాల్లో ఉచిత మధ్యా హ్నభోజనం, విద్యావ్యవస్థ బలోపేతం వంటి కార్యక్రమాలు చేపడతానని బాండ్ పేపర్‌పై సంతకం చేశారు. బీసీ సంఘాల ప్రతినిధులు బండి సాయన్న, విఠల్, విక్రమ్, మల్లేశం పాల్గొన్నారు.

నేతకాని మహర్ సేవా సంఘం కమిటీ ఎన్నిక

గర్మిళ్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : నేతకాని మహర్ సేవా సంఘం మంచిర్యాల జిల్లా నూతన కమిటీని ఆదివారం మంచిర్యాలలోని చున్నంబట్టివాడలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా గుమాస శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా వలీహైదర్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాజ్‌కుమార్, అధికార ప్రతినిధిగా రాజలింగు, కార్యవర్గ సభ్యునిగా రమేష్‌లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు స్వామి, సిద్దార్థ, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సన్మానం

జైపూర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఎస్టీపీపీలో బదిలీపై వెళ్తున్న ఎస్టీపీపీ ఈడీ ఎన్‌వీ రాజశేఖర్‌రావు, ఈ నెలలో పదవీ విరమణ పొందుతున్న సింగరేణి అధికారి వెంకటేశ్వర్‌రెడ్డిని ఆదివారి ఎస్టీపీపీలో అధికారులు ఘనంగా శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీపీపీ అధికారులు శ్రీనివాసులు, జేఎన్ సింగ్, ప్రసాద్, సుధాకర్, శ్రీనివాస్ , ప్రభాకర్‌రావు, తుకారాం, పంతుల నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా టీజీసెట్

బెల్లంపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం గురుకులాల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీజీసెట్ ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమగురుకుల పాఠశాలలో 790 మంది విద్యార్థులకు 771 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, 19 మంది గైర్హాజరైనట్లు ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. పరీక్షలను జోనల్ ఆఫీసర్ అరుణకుమారి పర్యవేక్షించినట్లు తెలిపారు.

కాంగ్రెస్ ఎమ్మెల్సీకి మద్దతు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ జన సమితి పార్టీ కాంగ్రెస్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి మద్దతు తెలుపుతుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ మందగుల హరి ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, ఎమ్మెల్సీ కోదండరాం ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు.

నేడు జిల్లాకు సీఎం రాక

(5వ పేజీ తరువాయి)

భారీ సంఖ్యలో పట్టభద్రులు, కాంగ్రెస్ శ్రేణులను తరలిం చేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నియోజకవర్గంలోని 12వేల మంది పట్టభద్రులను సీఎం సమావేశానికి రప్పించే ఏర్పాట్లు చేస్తుండగా, ఆత్మీయ సమ్మేళన సభకు మొత్తంగా 30వేల మందిని తరలించనున్నారు.

సీఎం టూర్ షెడ్యూల్ ఇలా..

సోమవారం నాటి సీఎం టూర్ షెడ్యూల్‌ను ఆయన పర్సనల్ సెక్రటరీ నర్మాల శ్రీనివాస్ విడుదల చేశారు. రేవంత్‌రెడ్డి ఉదయం 11 గం టలకు బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్ ద్వారా బయల్దేరి 11.45కు నిజామాబాద్ చేరుకుంటారు. అక్కడ సమావేశానంతరం 1.35కు బయల్దేరి నేరుగా మంచిర్యాలలోని సభాస్థలి వద్దకు చేరుకుంటారు. మంచిర్యాలలో 2.20 నుంచి 3.55 వరకు పట్టభద్రులు, కాంగ్రెస్ శ్రేణులతో సమావేశంలో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు బయల్దేరి కరీంనగర్‌కు చేరుకుంటారు. మంచిర్యాలలో సమావేశానంతరం జిల్లా కేంద్రంలోని గోదావరి రోడ్డులో నిర్మిస్తున్న వైకుంఠదామం ఏర్పాట్లను సీఎం పరిశీలించే అవకాశాలు ఉన్నాయి. దీంతోపాటు ఐబీ చౌరస్తా సమీపంలోని నిర్మాణంలో ఉన్న మాతా శిశు, 350 పడకల ఆస్పత్రిని సైతం సీఎం పరిశీలించనున్నట్లు సమాచారం.

సభ ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే

నస్పూర్ : సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా కలెక్టరేట్ సమీపంలో ఏర్పాటు చేసే సభస్థలాన్ని, ఏర్పాట్లను ఆదివారం ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు పరిశీలించారు. పట్టభద్రుల ఆత్మీయ సభలో పాల్గొనేందు కు సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు ముఖ్యమంత్రి ఇక్కడకు రానున్నారు. సభ, బందోబస్తు ఏర్పాట్లను మంచిర్యాల డీసీపీ భాస్కర్, ఏసీపీ ప్రకాష్, ట్రాఫిక్ ఏసీపీ జాన్ నర్సింహులు, రూరల్ సీఐ అశోక్, పట్టణ సీఐ ప్రమోద్‌రావు, ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ, మహిళా స్టేషన్ సీఐ నరేష్ కుమార్, స్థానిక ఎస్సై సుగుణాకర్ పరిశీలించారు.

విద్యార్థులు లక్ష్యం ఎంచుకుని చదవాలి

లక్షెట్టిపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి లక్ష్యం ఎంచుకుని చదవాలని ఎంఈవో హెలన్‌డార్థి అన్నారు. పట్టణ మున్సిపాలిటీ పరిధిలోని ఇటిక్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారులు చౌదరి, సత్యనారాయణ మూర్తి, ఎఎస్‌వో రాజ్‌కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వామనమూర్తి, గ్రామస్తులు కిష్టయ్య, లక్ష్మన్, తిరుపతి, శ్రీనివాస్, దేవా, రామయ్య, పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ అభ్యర్థిని గెలిపించాలి

గర్మిళ్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : టీఎస్‌యూటీఎఫ్ బలపరుస్తున్న టీపీటీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి అశోక్‌కుమార్‌ను గెలిపించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చక్రపాణి, రాజవేణు, నాయ కులు కిరణ్‌కుమార్,దేవదాస్, నర్సయ్య, రామన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రాష్ట్రీయ రహదారి కేకే ఓసీపీ సమీపంలో గల ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడడంతో స్థానిక పాత బస్టాండ్‌కు చెందిన దస్తగిరి షేక్ జిలానీ(30) అనేయువకుడు అక్కడికక్కడే మృతిచెందాడు. షేక్ జిలానీ మంచిర్యాలకు వెళ్లి బెల్లంపల్లి వైపు ద్విచక్రవాహనంపై తన సోదరుడు ముగ్దుంతో కలిసి వెళ్తుండగా ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

ముగ్దుంకు గాయాలయ్యాయి. ముగ్దుంను బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్ఐ రాజశేఖర్ సందర్శించారు. మృతుడు స్థానిక కేకే ఓసీపీలో లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు.

ఉదయ్‌పూర్‌సభలకు వయోవృద్ధులు

జన్నారం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో ఆదివారం నిర్వహించిన వార్షిక మహాసభలకు తెలంగాణ వయోవృద్ధుల సంఘం తరుపున వయోవృద్ధులు హాజరైనట్లు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య తెలిపారు.

నేడు కల్యాణం

గర్మిళ్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని శ్రీ విశ్వనాధ ఆలయంలో వెంకటేశ్వర స్వామి అధ్యయన బ్రహ్మోత్సవాలు మూడు రోజుల నుంచి ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణం నేడు జరుగు తుందని ఆలయ ఈవో ముక్త రవి, అర్చకులు భట్టాచార్య తెలిపారు.

ఘనంగా బోనాలు

చెన్నూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కత్తె రసాల గ్రామంలోని మల్లికార్జునస్వామి ఆలయంలో ఆదివారం బోనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. బోనాలు పోసి స్వామి వారికి నైవేద్యాలను సమర్పించారు. ఆలయంలోని అల్లు బండ వద్ద భక్తులు అల్లు పట్టారు. ఒగ్గు పూజారులు పట్నాలు వేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సింగరేణి ఉన్నత పాఠశాల విద్యార్థులు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లోని రెండు పాఠశాలలకు చెందిన పూర్వ విద్యార్థులు సమ్మేళనం పేరిట వేడుకలు నిర్వహించుకున్నారు. ఆర్‌కే 6 గుడిసెల్లోని లక్ష్మీ శిశుమందిర్ పదోతరగతి 2002-03 బ్యాచ్ పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు రవీందర్, కనకయ్య, రాజలింగు, దిలీప్, పాల్గొన్నారు. అలాగే సీసీసీలోని సింగరేణి ఉన్నత పాఠశాలకు చెందిన 1999-2000 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ వేడుకలు నిర్వహించుకున్నారు.

మందమర్రిరూరల్ : మహారాష్ట్రలోని గుగ్గున మండలం నకోడాలోని జెడ్పీ తెలుగు పాఠశాలలో ఆదివారం 1992-2015 పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమ్మేళనంలో మంచిర్యాల, బెల్లంపల్లి, మందమర్రి నుంచి పూర్వ విద్యార్థులు తరలి వెళారు.



లక్ష్మీ శిశుమందిర్ పూర్వ విదార్థులు



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

సమాజ్ రత్న అవార్డులు అందుకున్న వాంకిడి వాసులు


దుర్గం సందీప్‌కు అవార్డు అందజేస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న

వాంకిడి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు మహోల్‌కార్ అశోక్, ఎస్ఎస్‌డీ జిల్లా ఇన్‌చార్జి దుర్గం సందీప్ అదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం సమాజ్ రత్న అవార్డులను అందుకున్నారు. అదిలాబాద్ జిల్లా కేంద్రంలో అఖిల భారతీయ అంబేద్కర్ సాహిత్య, సంస్కృతి సంవర్ధాన్ మహమండల్, మౌలిక అధికార సమాజ్ సేవ మండల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అవార్డుల ప్రధానం కార్యక్రమంలో అఖిల భారతీయ సాహిత్య అకాడమి అధ్యక్షుడు ప్రశాంత్ జి వంజారే, మాజీ మంత్రి జోగు రామన్న, సంత్ రావిదాస్ సేల మండల్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రప్రకాష్ ముఖ్య అతిథులుగా హాజరై అవార్డులను అందజేశారు. సమాజ సేవ, దళిత సంఘాల చైతన్యం చేయడంలో వీరు చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డులను అందజేసినట్లు వారు పేర్కొన్నారు.


మహోల్‌కార్ అశోక్



అతివలకు బీమా.. అవగాహనతోనే ధీమా

- స్వయం సహాయక సభ్యులకు చేకూరనున్న ప్రయోజనం
- ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ. 10 లక్షలు
- అంగవైకల్యం కలిగితే రూ. 5 లక్షలు

వాంకిడి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అతివల ఆర్థిక స్వావలంబన కోసం మహిళా సంఘాల ద్వారా ప్రభుత్వాలు రుణాలను అందిస్తున్నాయి. సంఘాల ఏర్పాటు ద్వారా సభ్యులు రుణాలను పొందుతూ స్వశక్తితో ఎదుగుతున్నారు. లక్షలాది మంది మహిళలు ప్రగతి మార్గంలో పయనిస్తున్నారు. సంఘాల్లోని మహిళలకు మరింత ప్రోత్సాహాన్ని అందించేందుకు ప్రభుత్వం ప్రతీమహిళకు బీమా సౌకర్యాన్ని కల్పించాలని నిర్ణయించింది. సంఘాల్లో సభ్యురాలిగా ఉండి స్త్రీనిధి ద్వారా రుణం తీసుకున్న మహిళ అనివార్యకారణాల వల్ల మరణిస్తే రెండు లక్షల రూపాయల లోపు రుణాన్ని ప్రభుత్వమే చెల్లించేది. తాజాగా ప్రభుత్వం ఈ విధానాన్ని బ్యాంకు లింకేజీ ద్వారా తీసుకున్న వారికి కూడా వర్తింపచేస్తుంది.

● రుణ బీమా రూ. 2 లక్షలు

ఒక్కో సంఘానికి ఐదు లక్షల నుంచి 20 లక్షల వరకు ప్రస్తుతం రుణాలు అందిస్తున్నారు. రుణం పొందిన మహిళల్లో ఎవరైనా మరణిస్తే వడ్డీతో కలిపి ఆమె కుటుంబసభ్యులు చెల్లించాల్సి వచ్చేది. అలా చెల్లించకపోతే ఆ ప్రభావం గ్రూపు సభ్యులపై పడేది. ప్రస్తుతం పొదుపు మహిళలకు ప్రభుత్వం రూ. 2 లక్షల వరకు రుణ బీమా వర్తింపుచేస్తుంది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి పథకాల ద్వారా రుణం పొందిన మహిళ చనిపోతే ఆమె కట్టాల్సిన మొత్తాన్ని ప్రభుత్వం మాఫీ చేయనుంది.

● 92,512 మందికి ప్రయోజనం..

కుమరం భీం జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లో 8,275 స్వయం సహాయక సంఘాలకు చెందిన 92,512 వేల మంది సభ్యులు ఉన్నారు. అర్హత కలిగిన ప్రతీ మహిళ స్వయం సహాయక సంఘాల్లో చేరాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం బీమా సౌకర్యాన్ని కల్పించి ప్రోత్సహిస్తుంది. సంఘ సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకొని చిరువ్యాపారాలు చేసుకోవడానికి బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి, సీఐఎఫ్, మహిళాశక్తి పథకాల ద్వారా వివిధ రకాల రుణాలు అందజేస్తున్నారు.

● 18 నుంచి 60 ఏళ్ల వయస్సు వారికి..

పొదుపు సంఘాల మహిళలు ప్రమాదవశత్తు మృతి చెందితే అలాంటి వారి కటుంబాలకు రూ. 10 లక్షల ఉచిత బీమా వర్తింపచేయనున్నారు. ఒకవేళ వందశాతం వైకల్యం కలిగినా రూ. 10 లక్షలు అందిస్తారు. 50 శాతం వైకల్యం కలిగితే రూ. 5 లక్షలు చెల్లిస్తారు. మృతి చెందిన మహిళలకు పొదుపు అప్పు ఉంటే అది కూడా మాఫీ చేస్తారు. గాయాలైన మహిళ అంగవైకల్యం తెలుపుతూ సదరం ధ్రువపత్రాలు, చికిత్స పొందిన ఆసుపత్రి పత్రాలు సమర్పించాలి. 18 నుంచి 60 ఏళ్ల వయసున్న పొదుపు మహిళలకు ఇది వర్తిస్తుంది.

● అవగాహన అవసరం

ప్రభుత్వం అమలు చేస్తున్న బీమా పథకాలపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఈ రెండు పథకాలలో అర్హత సాధించాలంటే తప్పనిసరిగా అన్ని గ్రూపులవారు నెలవారీ సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. వాటికి సంబందించిన వివరాలు మినిట్స్ పుస్తకంలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలి. పొదుపు రుణం క్రమం తప్పకుండా చెల్లిస్తుండాలి. వీటి వివరాలు ఉండాలి. అయితే ఇలాంటి వాటిపై మహిళల్లో అవగాహన లేదు. రుణం పొందే సమయంలో మాత్రమే వీవోలు నమోదు చేస్తున్నారు. దీనిపై సెర్ప్, మెప్మా అధికారులు దృష్టి సారించాలి.

మహిళలకు ఎంతో ప్రయోజనం

\- మహేష్, ఏపీఎం, వాంకిడి



మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు రెండు రకాల బీమా సౌకర్యం కల్పించడంవల్ల ఎంతో ప్రయోజనం చేకూరనుంది. వారి కుటుంబాలకు, రుణం ఇచ్చిన బ్యాంకులకు ఆర్థిక భరోసా లభిస్తుంది. ఇంతకు ముందు స్త్రీనిధికి మాత్రమే ఉండేది. బ్యాంకు లింకేజీకి కూడా వర్తింపచేశారు. మహిళా సంఘాల సమావేశంలో సభ్యులందరికీ అధికారులు, సమాఖ్య బాధ్యులు బీమా గురించి వివరిస్తున్నారు. మహిళా సంఘాలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాము.

ఎమ్మెల్సీ ఓటు హక్కును వినియోగించుకోవాలి

\- కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా ఈ నెల 27న జిల్లాలో జరుగనున్న పోలింగ్‌లో అర్హత గల ఓటర్లు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే సూచించారు. ఈ నెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు పోలింగ్ రోజు సెలవు దినంగా ప్రకటించడం జరిగిందని, ప్రైవేటు ఉద్యోగులు తమ వీలు వెసులుబాటు చూసుకుని ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

ప్రశాంతంగా గురుకుల ప్రవేశ పరీక్ష


పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్‌రూరల్/సిర్పూర్(టి), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రశాంత వాతావరణంలో గురుకుల ప్రవేశ పరీక్ష నిర్వహించామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పరీక్షకు హాజరైన అభ్యర్థులకు పూర్తిస్థాయిలో సౌకర్యం కల్పించామన్నారు. 10 పరీక్షా కేంద్రాల్లో 3,893 మంది అభ్యర్థలకు గానూ 3828 మంది హాజరు కాగా 65 మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు.

వంతెన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

\- మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప


పనులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప

పెంచికలపేట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వంతెన నిర్మాణ పనులను త్వరిరగా పూర్తి చేయాలని మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప సూచించారు. ఆదివారం మండలంలోని కొండపల్లి గ్రామం నుంచి గొల్లవాడ మధ్య నూతనంగా నిర్మిస్తున్న వంతెన పనులను ఆయన పరిశీలించారు. అనుకున్న సమయంలో పనులు పూర్తి చేసి వినియోగంలోకి తేవాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. అనంతరం కార్యకర్త సత్తన్న కుమార్తె వివాహంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ్, సుధాకర్ తదితరులు ఉన్నారు.

సీఎం సమావేశాన్ని విజయవంతం చేయండి

\- ఎమ్మెల్సీ దండె విఠల్


చింతలమానేపల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలో జరిగే సీఎం రేవంత్‌రెడ్డి సమావేశాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పలువురు పట్టభద్రులతో డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సమావేశాన్ని విజయవంతం చేయాలని, ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డికి మద్దతుగా నిలువాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఉన్నారు.

కౌటాల (ఆంధ్రజ్యోతి): కౌటాల మండల కేంద్రంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నరేందర్‌రెడ్డికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. ఆదివారం డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావుతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన వెంట నాయకులు, యువకులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న 1990-91 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

కాగజ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1990-91 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక పద్మశాలి భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠాలు బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆహ్లాదంగా గడిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం చిన్న మాలిని గ్రామసమీపంలో అదే గ్రామానికి చెందిన మాధవరావు(45) శనివారం అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం చిన్న మాలినికి చెందిన మాధవరావు గత సోమవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదని కుటుంభీకులు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. శనివారం చిన్నమాలిని గ్రామ సమీపంలో కుళ్లిపోయిన వాసన వస్తుండటంతో గ్రామస్థులు సమాచారం అందించినట్టు తెలిపారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించగా, మాధవరావు మృతదేహంగా గుర్తించామన్నారు. తహసీల్దార్ కిరణ్, ఫోరెన్సిక్స్ నిపుణుల సమక్షంలో పంచ నామా నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలాపారు. మాధవరావు జంతువులను వేటాడేందుకు ఉపయోగించే వైరు (ఉచ్చు)కు తగిలి మృతి చెందినట్టు కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు.

కొనసాగుతున్న అప్రోచ్ స్లాబ్ పనులు

- తాత్కాలిక రోడ్డుతోనే రాకపోకలు - వంతెనపై రాకపోకల నిలిపివేత


పెద్దవాగు వంతెనపై నిలిచిన రాకపోకలు


తాత్కాలికంగా నిలిపివేసినట్టు ఏర్పాటు చేసిన బోర్డు

కాగజ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం అందవెల్లి వాగుపై గల జగన్నాథ్‌పూర్ వంతెనపై మళ్లీ రాకపోకలు నిలిచి పోయాయి. ఈ వంతెనకు ఉన్న అప్రోచ్ స్లాబ్ పనులు కొనసాగుతుండటంతో వంతెన పైనుంచి రాకపోకలను అధికారులు పూర్తిగా నిలిపివేశారు. వంతెనపై వాహనాలు పోనీయకుండా అధికారులు బోర్డును కూడా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం బ్రిడ్జి కిందభాగంలోని తాత్కాలికంగా రోడ్డు గుండా రాకపోకలు కొనసాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. చిన్నపాటి వర్షం కురిసిందంటే మళ్లీ రాకపోకలు నిలిచిపోయే అవకాశాలున్నాయని ఆయా గ్రామాల గ్రామస్థులు వాపోతున్నారు. పది నెలల క్రితం బ్రిడిపై రాకపోకలు పునరుద్ధరించాలని కోరుతూ సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు అందవెల్లి వాగు వద్ద నిరసన దీక్ష చేపట్టిన విషయం తెలిసిందే. అధికారులు ఆగమేఘాల మీద తాత్కాలిక అప్రోచ్ రోడ్డు పనులను పూర్తి చేశారు. రాకపోకలు పునరుద్ధరణ చేయగా, పదిహేను రోజుల క్రితం అప్రోచ్ స్లాబ్ పనులను ప్రారంభించారు. దీంతో కిందభాగంలో తాత్కాలిక రోడ్డు గుండా రాకపోకలు కొనసాగిస్తున్నారు. గతేడాది ఈ వంతెన సమస్యను సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకువచ్చి పనులను ప్రారంభించేటట్టు చేశారు. అధికారులు పూర్తి స్థాయిలో పనులు చేయక తాత్కాలికంగా అప్రోచ్ రోడ్డు వేశారు. ఈ విషయమై డీఈ లక్ష్మీనారాయణను వివరణ కోరగా వంతెనపై అప్రోచ్ స్లాబ్ పనులు చేస్తున్నట్టు తెలిపారు. పనులు కొనసాగుతుండటంతో వంతెన కింద భాగంలో గల తాత్కాలిక రోడ్డు నుంచి రాకపోకలు దారి మళ్లించినట్టు వివరించారు. త్వరలోనే రాకపోకలను పునరుద్ధరిస్తామని తెలిపారు.

సంత్ గాడ్గే బాబా జయంతి

వాంకిడి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సంత్ గాడ్గే బాబా జయంతిని ఆదివారం మండల కేంద్రంలోని జేతావన్ బుద్ధవిహార్‌లో ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ప్రజలను జాగృతం చేసిన గొప్ప వ్యక్తి సంత్ గాడ్గే బాబా అని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో బీఎస్‌ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కార్, ఎస్ఎస్‌డీ జిల్లా ఇన్‌చార్జి దుర్గం సందీప్, అంబేద్కర్ సంఘం మండల నాయకులు జైరాం ఉప్రె, దుర్గం ప్రశాంత్, ప్రతాప్, విజయ్, రమేష్, రోషన్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న ఎస్సై రాజు

దహెగాం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలం చౌక గ్రామ సమీపంలో ఎస్సై రాజు ఆధ్వ ర్యంలో ఆదివారం వాహనాల తనిఖీ చేపట్టారు. వాహన పత్రాలులేని వారికి జరిమానా విధించారు. ఈ సంద ర్భంగా ఎస్సై రాజు మాట్లా డుతూ వాహనదారులు సరైన ధ్రువపత్రాలను కలిగి ఉండాలని, మద్యం సేవించి వాహనాలను నడిపేతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చరిత్రకు చిహ్నం.. వాంకిడి శివాలయం

- శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్న ఆలయం


వాంకిడిలోని శివాలయం, ఇన్‌సెట్‌లో శివలింగం

వాంకిడి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రంలోని చిక్లీ నదీ తీరాన కాకతీయుల కాలంలో నిర్మించిన శివకేశవాలయం చరిత్రకు చిహ్నంగా నిలుస్తోంది. ఆలయాన్ని కాకతీయులు తమ విజయానికి సూచికగా ఇక్కడ నిర్మించారు. ఆలయంలో శివకేశవులతో పాటు, రేణుకామాత విగ్రహాలు ఉన్నాయి. శివకేశవులు ఒకే చోట కొలువుదీరడం విశేషం. ఆలయ నిర్మాణం పరిశీలిస్తే ఆనాటి శిల్పకళా వైభవం ఉట్టిపడుతోంది. ఆలయం నిరాధరణకు గురవడతో శిథిలావస్థకు చేరుకునే సమయంలో గ్రామస్థులు ముందుకు వచ్చి మరమ్మతులు చేపట్టి ఆలయాన్ని కాలగర్భంలో కలసిపోకుండా కాపాడుకున్నారు. ఏటా మహాశివరాత్రి రోజున ఆలయ ప్రాంగణంలోని చిక్లీ నదీతీరాన జాతర, రథోత్సవం నిర్వహిస్తారు.

● ఆలయం చరిత్ర...

మరాఠాప్రాంతమైన (మహారాష్ట్ర) దేవగిరి యాదవరాజు మహాదేవుడు కాకతీయ రాజైన గణపతిదేవుడి కాలం నుంచి తరచూ దండయాత్రలకు దిగేవాడు. రుద్రమదేవి హయాంలోనూ లక్షలాది సైన్యంతో ఓరుగల్లు సామ్రాజ్యాన్ని జయించడానికి దండెత్తి వచ్చాడు.

మహాదేవుడి సైన్యంపై 10 రోజులకు పైగా బీకర పోరాటంలో రుద్రమదేవి ప్రత్యక్షంగా పాల్గొన్నది. మహాదేవుడిని ఆ యుద్ధంలో మట్టి కరిపించింది. ప్రత్యర్థుల సైన్యాన్ని మరాఠా ప్రాంతాన్ని అనుకుని ఉన్న ఛత్తీస్‌గఢ్, ప్రస్తుత తెలంగాణ ప్రాంతంలో ఉన్న వాంకిడి వరకు తరిమి కొట్టింది. తమ విజయానికి గుర్తుగా మరాఠా సరిహద్దున ఛత్తీస్‌గఢ్ వరకు ఆలయాలను నిర్మించిందని చరిత్రను బట్టి తెలుస్తోంది. విజయానికి సూచికగా నిర్మించిన ఆలయాల్లో మిగతావి కాలగర్భంలో కలిసిపోగా ప్రస్తుతం వాంకిడి చిక్లీ నదీతీరంలో నిర్మించిన శివకేశవాలయం నేటికీ భక్తుల ఇలవేల్పుగా నిలుస్తూ ఆనాటి చరిత్రను తెలియజేస్తోంది.

● మరో వేయి స్తంభాలగుడి....

శివకేశవాలయం హన్మకొండలోని వేయి స్తంభాల గుడిని పోలి ఉంది. వేయిస్తంభాల గుడి ముందు ఉన్న నంది విగ్రహం లాగా ఆలయం ముందు నంది విగ్రహం, ఆలయంలోని స్తంబాలు వేయి స్తంబాల గుడిలో ఉన్న స్తంబాలను పోలి ఉన్నాయి. ఒకే రాతితో చేసిన పెద్దపెద్ద స్తంబాలు అమర్చారు. ఆలయ గోడలపై స్త్రీల నృత్య భంగిమలతో చెక్కిన శిల్పాలు కాకతీయుల శిల్పకళా నైపుణ్యానికి అద్దం పడుతున్నాయి. ఆలయానికి మూడు గోపురాలు ఉండగా ఆలయంలో శివుడు, కేశవుడు, రేణుకామాత విగ్రహాలు ఉన్నాయి.

● దేవాదాయ శాఖ ఆదరణ కరువు...

కాకతీయుల కాలం నాటినుంచి భక్తుల కొంగుబంగారంగా నిలుస్తున్న శివకేశవాలయం శిథిలావస్థకు చేరుకున్న దేవదాయ శాఖ ఆదరణకు నోచుకోలేదు. ఇంతటి చారిత్రకాలయాన్ని అభివృద్ధి పర్చడంలో దేవదాయశాఖ నిర్లక్ష్యం వహిస్తోంది. ఆలయం పక్కనే గల చిక్లీ వాగు ప్రవాహానికి ఆలయం ఉత్తర భాగం పూర్తిగా కోతకు గురికాగా గ్రామస్థులు ముందుకు వచ్చి చందాల రూపేణా పోగు చేసిన రూ. 40 లక్షలతో మరమ్మతులు చేపట్టారు. నది ప్రవాహానికి కోతకు గురికాకుండా చుట్టూ భారీ ప్రహరీని నిర్మించి ఆలయాన్ని రక్షించుకున్నారు. అతిపురాతనమైన ఈ ఆలయాన్ని ప్రభుత్వం ఆదరించకపోవడంతో ఆలయం అభివృద్ధికి నోచుకోవడంలేదు. ప్రతీ సంవత్సరం శివరాత్రి పర్వదినాన ఆలయాన్ని సందర్శించడానికి వచ్చిన జిల్లా అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పివెళ్లిపోవడమే తప్ప ఆలయం విషయంలో పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో స్థానికుల్లో అసంతృప్తి వ్యక్తం అవుతోంది.

● శివరాత్రి పర్వదినాన రథోత్సవం...

మహాశివరాత్రి పర్వదినాన ఆలయంలో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలకు మండలం నుంచే కాకుండా చుట్టుపక్కల మండలాలైన కెరమెరి, ఆసిఫాబాద్, కాగజ్‌నగర్‌తో పాటు మహారాష్ట్రలోని వివిధ గ్రామాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి శివకేశవులను దర్శించుకుంటారు. మహాశివరాత్రి పర్వదినాన సాయంత్రం అయిదు గంటలకు ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగిస్తారు. భజన కార్యక్రమాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి చిక్లీ నది తీరంలో రథోత్సవం కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. మహాశివరాత్రి సందర్భంగా ఆలయ సమీపంలోని చిక్లీ నదీ తీరాన రెండు రోజుల పాటు జాతర జరుగుతుంది.

సిర్పూర్(యు) మండలంలో..

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండలంలోని శైవ క్షేత్రాలు శివరాత్రి వేడుకలకు ముస్తాబు అవుతున్నాయి. మండల కేంద్రంలోని మహదేవ్ ఆలయమంలో ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. వందల సంవత్సరాలు చరిత్ర గల మహదేవ్ ఆలయం కోరిన కోర్కెలు తీర్చే దైవమని ఆదివాసీలు నమ్ముతారు. మహగాంలోని కైలాస్ టేక్డిలో శివరాత్రి వేడుకలకు అన్ని ఏర్పాట్లు గురుదేవ్ సేవ ఆశ్రమం అధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. మహగాంలో మూడు రోజుల పాటు జరిగే వేడుకలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరవుతారు.


సిర్పూర్(యు)లోని ఆలయంలోని శివలింగం